


సమకాలీన సమస్యలపై వ్యంగ్యాస్త్రాల పరంపర!!

*7*

## *ఇంటిదేవత*

'దేవుడున్నాడా - లేడా' అనే డిబేట్ ఈ ట్వంటీ ఫస్టు సెంచరీలో బొత్తిగా ఔట్ డేటెడ్ గా ఉంటుంది గానీ.. అసలు ఆ గాడ్ అనే వాడే గనక ఉండుంటే అతగాడు మగవాడే అయి ఉండాలనే రూలు మాత్రం ఎక్కడుందండీ?! ఆడాళ్ళంతా ఇంటిపనిలో, వంటపనిలో క్షణం తీరిక లేకుండా పడికొట్టుకుంటుంటే తీరి కూర్చుని మగాడు 'దేవుడు మగాడే' అని రాసిపారేస్తే ఆ మగరాతల్ని మూగ మొద్దుల్లా మనం ఎందుకు వప్పుకోవాలండీ?! క్రియేట్ చేయగల పవర్ ఒక్క ఆడజీవికే ఉందన్న జీవసిద్ధాంతం నిజమే అయుంటే ఈ చరాచర సృష్టి మొత్తానికి మూలం మరి ఒక 'స్త్రీ శక్తే' అయుండాలి గదండీ! ఎన్ని ముఖాలు, చేతులూ కాళ్ళూ ఉన్నాయని చెప్పుకున్నా.. బీడీలూ, సిగిరెట్లూ, బుడ్లు బుడ్లు బ్రాందీ సీసాలు తాగిపడేసే మగ పురుషుడి కెక్కడుందండీ?! పురాణాలూ, ఉపనిషత్తులూ, హిస్టరీలూ జాగ్రఫీలు చదివితే తెలుస్తుందని బుకాయిస్తే ఇంక లాభం లేదండీ! అవన్నీ ఏ మగమహారాజులో పనిగట్టుకుని గిలికి పారేసిన పసలేని రాతలేనని.. తలా తోకాలేని తలతిక్క సిద్ధాంతాలని తలకెక్కించుకోవాల్సిన అవసరం మనకింకే మాత్రం లేదని నిరూపించుకోవాల్సిన క్షణాలు ముంచు కొచ్చేసాయండీ! పదండి.. కొప్పులు బిగించి!!

'అమ్మలగన్నయమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ బాల బెద్దమ్మ సురారులమ్మ కడుపారడి పుచ్చినయమ్మ' అంటూ మగవాడై ఉండీ ఆ పోతనామాత్యుడు అంత పారవశ్యంతో తన భాగవతాన్ని మహత్వ కవిత్వపరంగా ఢంకా బజాయించి చెప్పి ఆరు శతాబ్దాలు దాటిపోయినా మన మగాళ్ళు మాత్రం ఈ సృష్టి మొత్తానికి తామే పెద్ద అధినాయకులయినట్లు ఆ అమెరికా ఒబామా టైపులో కలిగిస్తూంటే కట్ చేయకుండా సహించి ఊరుకోడు ఇంకే మాత్రం తగదండీ! తగదుగాక తగదండీ!

ఆడదంటే వంటింటి కుందేలో, కొప్పులో మల్లెపూలు పెట్టుకుని నాయుడు బావకోసం ఎప్పుడూ ఎదురు చూస్తూ కూర్చునుండో ఏ ఎంకినో, పండగలకీ పబ్బాలకీ పిల్లలు పిండివంటలు చేసుకుని మురిసిపోయే పిచ్చి ఇల్లాలో, మొగుళ్ళు కలకాలం చల్లంగా ఉండాలని కడుపు మాడ్చుకుని గుళ్ళ చుట్టూ ప్రదక్షిణాలు చేసుకునే పతివ్రతా శిరోమణినో అని మగవాడు ఇంకా ఈ కలి చివరి పాదంలో కూడా భ్రమపడుతుంటే ఎలా? డ్రాయింగ్ రూంలో సోఫా మీద దర్జాగా కాలుమీద కాలేసుకుని ఆదివారం పూటైనా సరే మొగుడు కలిపిచ్చిన ఫిల్టర్ కాఫీ 'సిప్' చేస్తూ స్టార్‌డస్ట్ పేజీలు నంజుకుంటూ టీవీలో వచ్చే ఎఫ్ ఛానెల్ ఎంజాయ్ చేసే కాలం.. ఏం..ఎంజాయ్‌చేసే కాలం

ఆడదానికి మాత్రం ఏనాటికీ రాకూడదాండీ? కుమారి శతకం బట్టీ పెట్టించే కాలంతోనే ఇంకా మనమున్నామా?! అప్పుడెప్పుడో అమ్మకు అమ్మమ్మ అప్పగింతలప్పుడు చెప్పిన 'నారీ ధర్మాలన్నీ' పాటించితేగానీ పతివ్రతలమనిపించుకోని యుగంలోనే మనమింకా ఉన్నామా?! మన మగాళ్ళు మాత్రం ఆ ఆదిత్య హృదయంలో చెప్పినట్లు శిరోముండనాలు, శిఖలు, నుదుటన దిద్దుకున్న తిరుచూర్ణాలలో సంధ్యావందనం చేసిన తరువాత మాత్రమే బ్రేక్ ఫాస్ట్ చేస్తున్నారా?! పంచెలూ ధోవతుల దాకా ఎందుకూ.. ప్యాంటూ చొక్కాలు కూడా వదిలేసి అమెరికా కొడుకులు వాడి వదిలేసిన వదులు వదులు బర్ముడాలు, బుష్ షర్టూ, బూట్లూ వేసుకుని బూచాళ్ళలాగా పార్కుల్లో పడి ఏదో బడాయిగా మార్నింగు వాకులు చేయటంలా?! ఎన్ని యుగాలు మారినా ఆడదాని మెడకు మాత్రం అన్ని పలుపుతాళ్ళు లెక్క తప్పకుండా ఉండాల్సిందేనా?! అవన్నీ అవాకులూ చెవాకులూ అనిపించటం లేదటండీ?!

ఇంటి ఆడది ఈ మగాడికి కల్పనారాయ్, పక్కింటావిడ మాత్రం పాతికేళ్ళ దగ్గర ఆగిపోయిన ఐశ్వర్యారాయ్! పిలవకుండానే పక్కలోకి వస్తుందిగదా.. అడుక్కోకుండానే అన్నీ వేళకి అమర్చి పెట్టే పిచ్చిది కదా. పిల్లల్ని కనిపెట్టి.. తాను ఏ షికారుకో, సెకండ్ షో సినిమాకో, క్యాంపు పేరుతో పొరుగూరు హోటల్‌కో వెళ్ళి జల్సా చేస్తుంటే ఆ పిల్లల్ని కనిపెట్టుకుని ఉండే పైసా పేమెంటులేని కాపలా మనిషిగదా! ఆదివారం, పండగ పూటని కూడా చూడకుండా సెలవు లేకుండా ఇంటిపని, పెంటపని ఠంచనుగా టైము తప్పకుండా చేసిపెట్టే పనిమనిషిగదా! అందుకే.. ఎంత అందమున్నా.. అంది వచ్చినందుకే మగాడి ముందు తలొంచుకుని తాళికట్టించుకున్నందుకే ఆడది అంటే అంత ఎగతాళి! ఎలాగండి?!

ఆడదాని బ్రతుకు 'అడవిగాచిన వెన్నెల' అని ఎవరన్నారో గానీ.. అక్షరలక్షలిచ్చి ఘనసన్మానం చేయాలామహానుభావులకు! 'సంసారం' నిజంగా అడవే. ఆడది అందులో మగాడు చెండుకు తినే లేడి. అడగకుండానే కాచే వెన్నెలంటే ఎవరికైనా చులకనే కదా మరి! సూరీడు వేడి కిరణాలను భరించి అమృతం లాంటి వెన్నల సోనలను కురిపించే చందమామను - సంసారం తాపాన్ని తాను భరిస్తూ ఇంటిల్లిపాదికీ చల్లని సుఖాన్నిచ్చే అందాల భామతో పోల్చినందుకు మరోసారి ఆ మహానుభావుడి కాలికి గండపెండేరం కూడా తొడగాలండీ!

పప్పులో ఉప్పెక్కువైందని చిందులేసే మగమహారాజుకి పప్పులూ ఉప్పులూ భోజనంగా మారటానికి ఇంటి ఇల్లాలు ఎంత సుఖాన్ని ప్రేమతో రంగరించి పోస్తుందో ఎన్నడైనా ఆలోచించగలడా! ఆఫీసు నుంచి ఇంటికొచ్చీ రాగానే గుమ్మంలోనే కమ్మటి కాఫీని అందించే ఆ పిచ్చి తల్లి ఇంటిపట్టునే ఉండి ఎంత గ్రౌండ్ ప్రిపేర్ చేయకబోతే ఇంటిల్లిపాదీ అంత 'సౌండ్'గా రాత్రుళ్ళు నిద్రపోగలుతున్నారూ... ఎప్పుడైనా ఒక్క క్షణం తీరిగ్గా ఆలోచించాలని అనిపించలేదా?! ఆమె ఒక్క గంట పాటు చూస్తే టీవీ సీరియల్స్, మీదో చీరల షాపింగ్ మీదో, ఇరుగు పొరుగమ్మలతో చేసే గప్పా గోష్ఠి మీదో జోకులు కట్ చేయటమే గొప్ప సెన్సాఫ్ హ్యూమర్‌గా భావించే నిజంగా ముద్దొచ్చే మగాడు సంసారమనే 'సైన్సు'కి సరయిన ఫార్ములా నిజంగా కనిపెట్టింది ఆమే అని అందుకే తెలుసుకోలేకుండా ఉన్నాడు! తెచ్చి పడేస్తే వండి పడెయ్యటం కూడా ఓ పెద్ద ఘనకార్యమేనా? అని వెటకారం చేసే మగాడి చేతిలో ఓ ఆదివారం పూట వంట గరిటె పడేస్తే ఆ వేడి ఎంతో అనుభవంలోకొస్తుంది. సంసారాన్ని నడపటం - చట్టసభను నడపటం కన్నా కష్టతరం. ఒక్క గృహవసతి వందమంది సభాపతుల పెట్టు. తెల్లారుఝామునే పేపరూ, పాలపేకెట్లూ, కళ్ళుతెరవగానే బెడ్ పక్కన పొగలు కక్కే కాఫీ, బిస్కెట్లు... బాత్ రూములో వేడినీళ్ళు, షేవ్ చేసుకునే రేజర్, స్నానమాడి బైటకు రాగానే చలువ దుస్తులూ, కొబ్బరి చట్నీ, సాంబారులతో బ్రేక్ ఫాస్టులూ, .. కాళ్ళకు వేసుకునే జోళ్ళ దగ్గర్నుంచీ.. కళ్ళకు పెట్టుకునే జోళ్ళుదాకా అన్నీ అమర్చి.. బండెక్కి ఆఫీసుకు పోయేటప్పుడు పట్టించుకున్నా పట్టించుకోకపోయినా ప్రేమతో 'టాటా' చెప్పే ఆ పిచ్చి ఇల్లాలు.. ఆడదైనప్పుడు దేవుడు మాత్రం ఆడది గాక మగవాడు ఎలాగవుతాడు చెప్పండి?! మరీ చోద్యంకాకపోతే! కష్టమొచ్చినప్పుడు మనిషి తలుచుకునే ఆ దేవుడు మరి ఆడదే అయినప్పుడు మరి మగాడు 'ఆడదానిని' అంత చులకనగా చూడటం దేవుడిని అవమాన పరిచినట్లేకదండీ! మనం నిత్యం కొలిచే దేవుడి శంఖు చక్రాలను గదా అభయహస్తాలను అంత

భక్తిగా గౌరవిస్తున్నప్పుడు మరి మన భూలోక దేవుడితో ప్రేమగా చేతులకు ధరించే గాజులను, పసుపూ కుంకుమలను ఒక చేతగాని వారు ధరించే వస్తువులుగా మగవాడు చూడటం ఎంత అవమానకరమండీ?! స్త్రీలింగ వాచకాన్ని ఒక నీచార్థంలో వాడటం నిజంగా చూస్తే పెద్ద దైవదూషణ క్రిందకే వస్తుంది కదండీ! ఇకనైనా మగాళ్ళు గాజులూ, పసుపు కుంకుమలను అవమానకరమైన వస్తువులుగా చూసే అవలక్షణం మానుకోవాలండీ - ముఖ్యంగా ఉద్యమాలు చేసేవాళ్ళు.

Post your comments